క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ:అనంతపురం జిల్లాతోపాటు ఉరవకొండ ప్రజలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈఏడాది అంతా వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సాగు చేసిన పంటలు చేతికంది, వారికి గిట్టుబాటు ధర దక్కాలన్నారు. ప్రతి ఇంట్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాలి



విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఉరవకొండ: తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా జరుపుకునే సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు నిండాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కోరుకున్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పండుగ సంబరాలతో తెలుగు లోగిళ్లు శుభాలకు, సుఖ సంతోషాలకు నెలవు కావాలని, రైతుల ఇంట ఆనందాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



భీమేష్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: మండలంలోని బూదగవికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే భీమేష్‌బాబును మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతపురంలోని సవేరా ఆస్పత్రిలో భీమేష్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అక్కడి వైద్యులను మాజీ ఎమ్మెల్యే విశ్వ సూచించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



వైఎస్సార్ సీపీ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : వైఎస్సార్‌గ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. సోమవారం ఇటీవల వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న జిల్లా ఉపాధ్యక్షుడు కోనాపురం గంగాధర , జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు రేవన్న , కంబదూరు ఎంపీపీ భీమేష్ తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శెట్టిగారి మంజునాథ, ఎంపీటీసీ బుసప్ప, నాయకులు లోకేష్, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గొర్ల గంగాధర, మహాత్మరెడ్డి, లింగన్న, మహాలింగ, రమేష్, ఆర్‌ఎంపీ డాక్టర్ వసంత్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

కుర్ని సమాజ సేవా సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న కుర్ని సమాజ సేవా సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్:పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం 2025 నూతన సంవత్సరం కురిహినశెట్టి (కుర్ని) సమాజ సేవా సంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుర్ని సమాజ సంఘం అధ్యక్షుడు మాంత శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు దబ్బడి వెంకటేశులు, ఆర్‌ఎస్‌ఎం నాగరాజు, కార్యదర్శి చంద్ర, కోశాధికారి తిప్పేస్వామి, సమాజ పెద్దలు కంబ్లీ రాజశేఖర్, తట్టే చంద్ర, బసవరాజు, యోగేష్, మాజీ కౌన్సిలర్ టంకశాల హనుమంతు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఉరవకొండ: వైద్య ఆరోగ్య శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం కలిసి విన్నవించారు. యూనియన్ అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి నాయకత్వంతో ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కుమారిబాయి, భారతమ్మ తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. కడప జోన్‌లో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న 8 జిల్లాల మలేరియా సబ్ యూనిట్ అధికారుల సమావేశానికి మంత్రిని ఆహ్వానించారు.

ఆటల పోటీలు

కూడేరు: కడదరకుంటలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని ఆటలపోటీలు సోమవారం నిర్వహించారు. రైతు సంఘం నేతలు ఇప్పేరు నారాయణ రెడ్డి, ఈరప్ప, రాధా కృష్ణ, వెంకటేశులు పాల్గొన్నారు.

సందడి లేని సంక్రాంతి



మురడి వద్ద కాతలేక బోసిపోయిన వేరుశనగను చూపుతున్న మహిళా రైతు



బొమ్మనహాళ్ వద్ద వరి ధాన్యాన్ని తూర్పార బడుతున్న దృశ్యం

- ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న ఖరీఫ్ పంటలు
- ఇంటికి చేరని కొత్త ధాన్యం రాసులు
- అమలుకు నోచుకోని సూపర్‌సిక్స్ హామీలు
- ఏడాదికి రూ.1327 కోట్లు పేదలకు దూరం.. భారం

రాయదుర్గం: ఖరీఫ్ కలిసి రాలేదు.. పంట ఉత్పత్తులు చేతికందలేదు.. కొత్తధాన్యం ఇంటికి చేరలేదు. ప్రకృతి వైపరీత్యాలు దెబ్బతీశాయి.. ఫలితంగా అన్నదాతల ముఖాల్లో సం'క్రాంతి' తప్పింది. సూపర్ సిక్స్ పథకాలూ అమలుకు నోచుకోక, చేతిలో చిల్లిగవ్వలేక రైతులు ఆందోళనలో ఉన్నారు. గతేడాది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. నవరత్న పథకాలతో నవశకానికి నాందీ పలికారు. అనేక పథకాలు అమలు చేసి ఆదుకున్నారు. రైతులు, పేదల ముఖాల్లో చిరునవ్వు కనిపించింది. ప్రస్తుతం సంక్షేమ ఫలాలు అందక పండగపూట పరమాన్నం కాదు కదా.. పప్పన్నం కూడా లేకపోయిందని పేదలు ఆవేదనతో ఉన్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 2023-24 మార్చి వరకు రూ.1,327 కోట్లు ఖర్చుచేశారు. ఈ మొత్తం ఆయా పథకాల ద్వారా 10,50,509 మంది ఖాతాల్లోకి నేరుగా (డీబీటీ) ద్వారా జమచేశారు. ఈ నేపథ్యంలో సెంటు భూమిలేని వారైన సరే ఏదో ఓ పథకం వర్తించింది. దీంతో వారి ఖాతాలు కాసులు గలగలలాడేవి. పండుగలొచ్చినా, అత్యవసర ఖర్చులకైనా వెనుకంజ వేయని పరిస్థితి. బటన్ నొక్కగానే చిరు వ్యాపారుల్లో సంతోషం కనిపించేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రైతులు, పేదలు, చిరు వ్యాపారులకు పండుగ సంతోషం దూరమైంది.

వెలవెల బోయిన దుకాణాలు..

పల్లెల్లోనూ సంక్రాంతి సందడి కనిపించలేదు. సంక్రాంతి అంటే చాలు కిరాణా, దుస్తులు, బంగారం, రంగుల పొడి దుకాణాలు వ్యాపారులతో కిక్కిరిసేవి. గతేడాదితో పోలిస్తే దెబ్బ పడింది. ఈఏడు రూ.లక్ష వ్యాపారం ఆశిస్తే రూ.20 వేలు జరగని పరిస్థితి. పండగ పూట పల్లెల నుంచి పట్నం వైపు బస్సులు, ఆటోలు నిండుగా వచ్చేవి. ప్రస్తుతం ఏ వాహనం చూసినా ప్రయాణికులు లేక బోసిపోయాయి.

పంటలే పండలేదు



ఆశించిన స్థాయిలో పంటలు పండలేదు. ఏ సంతోషంతో పండుగ జరుపుకోవాలి. ఏది కొనాలన్నా.. ఏది తినాలన్నా మార్కెట్లో ధరలు చూస్తే భయమేస్తోంది. రూ.10 వేలు తీసుకెళ్లినా సంచిలోకి సరుకులు రాలేదు. రంగులు కొనాలన్నా ఇబ్బందిగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది సంబరమేలేదు.

– వాల్మీకి పాలయ్య, రైతు, చెరువుదొడ్డి

పండుగ వాతావరణమే లేదు



మా చిన్నప్పుడు సంక్రాంతి అంటే సంబరంగా భావించాం. ఇంటికి కొత్త ధాన్యం వచ్చేది. అల్లుళ్లు, కూతుళ్లు, వారి పిల్లలు, బంధువులతో ఇళ్లంతా సందడిగా ఉండేది. ఈ ఏడాది పంటలు చేతికందక, సంక్షేమ పథకాలు దరి చేరక ఏ ఇంట చూసినా సం'భ్రాంతి'గా మారింది.

– గందవిడి తిప్పేస్వామి, రైతు, భూపసముద్రం

కనిపించని సంక్రాంతి



కూడేరులో వెలవెలబోతున్న వస్త్ర, రంగుల దుకాణాలు

కూడేరు: మండలంలో ఈ ఏడాది సం'క్రాంతి ' కనిపించలేదు. సంక్రాంతి అంటేనే మండల కేంద్రంలోని కిరాణా, దుస్తులు దుకాణాలు, రంగుల, గుమ్మడికాయల షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడేవి. కానీ సోమవారం భోగి పండుగైనా సందడి కనిపించలేదు. కొనుగోలుదారులు లేక ఆయా దుకాణాలు వెలవెలబోయాయి.

భాగవత సప్తాహ కార్యక్రమం



బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందించిన దృశ్యం

బెళుగుప్ప: నక్కలపల్లి ప్రభుత్వ పాఠశాల, బెళుగుప్ప సన్‌రైజెస్ పాఠశాలలో భాగవత సప్తాహ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పాఠశాలల బాల బాలికలు ఉపాధ్యాయులతో కలసి పద్యాలను పాడారు. ముఖ్యఅతిథులు నాగేశ్వరరెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాసులు, కరస్పాండెంట్ మారెన్న, ఉపాధ్యాయులు నాగరాజు, తిరుమలరెడ్డిని నిర్వాహకులు నారాయణ రెడ్డి, సర్పంచు రామిరెడ్డి, గ్రామస్తులు సన్మానించారు. బుధవారం వరకు భాగవత సప్తాహ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పైపులైన్ లీకేజీతో నీరు వృథా



బ్యాంకు ముందు వృథాగా వెళ్తున్న నీరు

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక గ్రామీణ బ్యాంక్ ముందు ఫుట్‌పాత్‌పై పైపులైన్ లీకేజీతో తాగు నీరు వృథా అవుతోంది. గత పది రోజులుగా నీటి వృథాతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌పాత్‌కు ఆనుకొని సుమారు 15 వివిధ దుకాణాలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య



జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న నాయకులను సన్మానిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచే బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ మరింతగా కష్టపడాలని మాజీ ఎంపీ, పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సూచించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల విడుదల చేసిన జిల్లా కమిటీలో కళ్యాణదుర్గం నేతలకు సముచిత కల్పించిన విషయం విదితమే. సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి తదితరులు జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కోనాపురం గంగాధర, జనరల్ సెక్రటరీ ములకలనూరు బోయ తిమ్మరాయుడు, ఆర్గనైజేషనల్ సెక్రటరీ తలారి సత్యప్ప, యాక్టివిటీ సెక్రటరీ పి.ఆనంద్ చౌదరిని సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్లు సుధీర్, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, హరి, కోఆప్షన్ సభ్యుడు మారుతి, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, అడ్వకేట్లు హనుమంతరెడ్డి, రామాంజినేయులు, గోళ్ల సూరి, సత్తిరెడ్డి, బొమ్మయ్య, మంజునాథ్‌రెడ్డి, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఉమాపతి, పరంధామరెడ్డి, గోళ్ల మోహన్‌రెడ్డి, బిక్కిహరి, షేక్షావలి, నాగరాజు, ఇబ్రహీం, మురళి, చరణ్, చిరు, దుర్గా ప్రసాద్, వంశీ, నారాయణరెడ్డి, రామిరెడ్డి, జయరామిరెడ్డి, పోతేష్, పాండు, జానీ, పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని నిరసన



కళ్యాణదుర్గంలో విద్యుత్ బిల్లులను కాల్చివేస్తున్న దృశ్యం

ఉరవకొండ/కళ్యాణదుర్గం: ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. రాయంపల్లి, ఆమిద్యాల, నెరిమెట్ల, రాకెట్ల తదితర గ్రామాల్లో రైతులు, గృహ వినియోగదారులు భోగి మంటల్లో బిల్లులు వేసి కాల్చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, మురళీ, వీరాంజనేయులు, రవి కుమార్, వెంకటేశులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు సలీం, రాజశేఖర్, అరవింద్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాయదుర్గంటౌన్: మిద్దెపై నుంచి జారి పడి అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ సురేష్(28) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వివరాలు.. రాయదుర్గం అంబేడ్కర్ కాలనీలోని సురేష్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. గత గురువారం రాత్రి ఇంటి మిద్దెపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు.

భారీ వాహన రాకపోకలతో ఇక్కట్లు



రాయదుర్గం పట్టణం మీదుపై వెళ్తున్న భారీ వాహనాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో భారీ వాహన రాకపోకలతో వాహనదారులు, పాదచారులకు ఇక్కట్లు తప్పలేదు. పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి, అడిగుప్పకు వెళ్లే దారిలో మరో రైల్వే అండర్ బ్రిడ్జి కింద ఊటనీరు నిలిచి ఉండడంతోపాటు రోడ్డు ధ్వంసమైంది. దీంతో భారీ వాహనాలన్నీ పట్టణం మీదుగానే వెళ్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతుండడమే కాక దుమ్మూధూళితో వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ రైల్వే అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది.

ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ



పాలు, పండ్లు అందిస్తున్న లయన్స్ సభ్యులు

ఉరవకొండ: లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సోమవారం ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయచంద్ర మాట్లాడారు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో లయన్స్ సభ్యులు రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు కొమ్మసాని బాలచంద్ర, గణేష్‌బాబు, పీజీఎస్ నూర్‌మహ్మద్, మేళ్ల ప్రభాకర్ నాయుడు, జాబీర్, జీకే శ్రీధర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 2010-11 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 2010-11 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.







వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం



ధనుర్మాస పూజలందుకున్న ప్రసన్న వేంకటరమణస్వామి



గోదాదేవి వేంకటరమణస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు



రాయదుర్గంలో కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున హాజరైన భక్తులు



బెళుగుప్ప రామేశ్వరస్వామికి అన్నాభిషేకం చేసిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసిద్ధిగాంచిన కలియుగ దైవం ప్రసన్న వేంకట రమణస్వామిఆలయంలో సోమవారం గోదాదేవి శ్రీవారి కల్యాణోత్సవం అరంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు ఆలయం స్వామికి ధనుర్మాస ప్రత్యేక పూజలు, అలంకరణ, తిరుప్పావై సేవ, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గోదాదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణక్రతువు నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తే సకల శుభాలు సిద్ధిస్తాయని అర్చకులు బాల మురళీకృష్ణ తెలిపారు. కల్యాణోత్సవానికి ముందు గోదాదేవి మహిళా భక్తమండలి ఆధ్వర్యంలో గోదాదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కూర్చొబెట్టి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి లక్ష్మీబజార్ లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం వరకు ఊరేగించి తిరిగి కోటలోని ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రాయదుర్గంలో శివుడికి అన్నాభిషేకం

రాయదుర్గంలోని శివాలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసం ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకొని శంకరమఠం, జంబుకేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, చెన్నవీరస్వామి, నీలకంఠేశ్వరస్వామి, మార్కండేయస్వామి, శివాలయాల్లో శివుడికి అన్నాభిషేకం, ఏకాదశవార రుద్రాభిషేకం, బిల్వస్తోత్రం ,మహాన్యాస పారాయణం, పంచామృతాభిషేకం చేశారు. నగరేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం, రుద్రాభిషేకం, పుష్పార్చన, ధూపదీప నైవేద్యం చేశారు. జంబుకేశ్వరస్వామికి పూజలు, అన్నాభిషేకం చేశారు.

రామేశ్వరస్వామికి అన్నాభిషేకం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో రామేశ్వరస్వామికి సోమవారం అన్నంతో అభిషేకం చేశారు. భోగి పండుగ సందర్భంగా స్వామి మూలవిరాట్‌కు అన్నాభిషేకం చేశారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు, గుమ్మఘట్ట, గోనబావి, గొల్లపల్లి, భూపసముద్రం, గలగల, తాళ్లకెర, పూలకుంట, నేత్రపల్లి, బేలోడు, రంగసముద్రం, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున ఆకుపూజ, పంచామృతాభిషేకం, బిల్వార్చన, సహస్రనామార్చన, మహామంగళారతి పూజలు చేశారు.

ప్రారంభమైన కొల్లాపురమ్మదేవి జాతర

శెట్టూరు: చింతర్లపల్లి గ్రామ దేవత కొల్లాపురమ్మ జాతర ప్రారంభించారు. సోమవారం ఉదయం జలధి గంగపూజతో ప్రారంభమైన ఉత్సవం సాయంత్ర గ్రామంలో అమ్మవారి ఊరేగింపు వైభోగంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారి జ్యోతుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



రాయదుర్గంలోని నగరేశ్వరస్వామికి అన్నాభిషకం చేసిన దృశ్యం



శంకరమఠంలో దత్తాత్రేయుడికి ఆరుద్రోత్సవ పూజలు



కలుగోడులో పూజలందుకున్న ఈశ్వరుడు



చింతర్లపల్లిలో జలధికి తరలిన కొల్లాపురమ్మ అమ్మవారు